RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 438 | 1 శనివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




# "క్రిమినల్ వేస్ట్"..

## - ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ దుమారం



తెలంగాణలోని ఇంజినీరింగ్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రతిఏటా 1.1 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, వారిలో కొందరు కనీసం ఉద్యోగ దరఖాస్తును కూడా నింపలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఒక తెల్ల కాగితం ఇచ్చి అప్లికేషన్ రాయమంటే రాయలేని పరిస్థితి నెలకొంది. ఇది 'క్రిమినల్ వేస్ట్'. ఇంజినీరింగ్ చదివామంటూ చిన్న ఉద్యోగాలకు వెళ్లరు, అదే సమయంలో అవసరమైన నైపుణ్యాలను కూడా అలవర్చుకోరు" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డిని "చీప్ మినిస్టర్" అని సంబోధిస్తూ, ఆయన విద్యార్హతలను ప్రశ్నించారు. "రియల్ ఎస్టేట్ బ్రోకర్ స్థాయి నుంచి బ్లాక్‌మెయిలర్‌గా ఎదిగారు" అంటూ ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి ముఖ్యమంత్రికి ఉన్న అర్హత ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. తన జీవితంలో రేవంత్ రెడ్డి ఎప్పుడైనా పోటీ పరీక్షలు రాశారా? లేదా ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారా? ఎక్కడైనా ఉద్యోగం చేశారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. తక్షణమే సీఎం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ నేతలు సైతం ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది యువతను కించపరచడమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగాల కల్పనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను విద్యార్థులను విమర్శించలేదని, వారికి సరైన నైపుణ్యాలు అందించడంలో విఫలమవుతున్న విద్యా వ్యవస్థను మాత్రమే ఉద్దేశించానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచారు. విద్యార్థుల్లోని నైపుణ్యాల అంతరాన్ని సరిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొంటూ కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టారు.

## పోరాటాలను అక్రమ కేసులు

# ఆపలేవు

## : నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్




"ప్రజల తరపున మేం చేసే పోరాటాలను ఇటువంటి తప్పుడు కేసులు ఎంతమాత్రం ఆపలేవు.. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫార్ములా-ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఉదయం కోకాపేటలోని తన నివాసం నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు కేటీఆర్ చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కుట్రపూరితంగా అక్రమ కేసు బనాయించిందని ఆయన మండిపడ్డారు. మరోవైపు, తదుపరి విచారణకు కోర్టు ఆగస్టు 25కి వాయిదా వేసింది. కోర్టు ప్రక్రియ ముగిసిన అనంతరం, అకాల మరణం చెందిన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయన నర్సంపేటకు బయలుదేరారు.

కేసు నేపథ్యం:

యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆర్గనైజేషన్'కు నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్లు మళ్లించారనే అభియోగంపై ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోవడంతో, నిందితులుగా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డి తదితరులు న్యాయస్థానానికి హాజరయ్యారు.

## వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు

### : కారుణ్య నియామకంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వివాహిత అనే కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది. బీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

## హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి

### : హైకోర్టు తాజా ఉత్తర్వులు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.

## బాబు హయాంలోనే అనేక పెట్టుబడులు..

### - సీఎం రేవంత్‌రెడ్డి



బిల్‌గేట్స్, బిల్‌క్లింటన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 నుంచి 2004 వరకు నాటి సీఎం చంద్రబాబునాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని సీఎం రేవంత్ కొనియాడారు. శుక్రవారం సీఐఐ ప్రతినిధుల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ.. బిల్‌గేట్స్, బిల్ క్లింటన్‌లాంటి అనేక దిగ్గజాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అని ప్రశంసించారు. పోర్టులకు అనుసంధానంగా రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలన సాగించిందని, గత పాలకులు తీసుకొచ్చిన కొన్ని మంచి విధానాలు కొనసాగిస్తూనే కొత్త విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా?

### : రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్



ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఆస్ట్రేలియా మంత్రికి స్వాగతం పలికిన నారా లోకేశ్...

### - కీలక ఒప్పందాలు



ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, పౌరసత్వ వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనకు విచ్చేశారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలిసి జూలియన్ హిల్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ పర్యటన వివరాలను మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఆస్ట్రేలియా మంత్రితో జరగనున్న చర్చలు ఫలవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, పెట్టుబడుల వంటి కీలక రంగాల్లో ఇరుపక్షాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంపై ఈ పర్యటనలో ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు లోకేశ్ తెలిపారు. ఈ పర్యటన ద్వారా ఏపీ, ఆస్ట్రేలియా మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతుందని అధికారులు భావిస్తున్నారు.

# నందిగామలో ప్రత్యేక నాకాబందీ..

## నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:–
ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని నందిగామ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ ప్రధాన రహదారిలోని ఎంఆర్ఓ కార్యాలయం సమీపంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడం లక్ష్యంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 80 వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పెండింగ్‌లో ఉన్న 53 ఈ–చలాన్లను క్లియర్ చేయించి రూ. 23,770 జరిమానా వసూలు చేశారు. అదనంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు 8 స్పాట్ చలాన్లు జారీ చేసి రూ. 1,100 జరిమానా విధించారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకోగా, మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు సూచించారు. ఈ నాకాబందీ కార్యక్రమాన్ని నందిగామ ఎస్‌హెచ్‌ఓ బి. వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది నిర్వహించారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ఆగస్టు2న 'నషా ముక్త యువ' మహా సంకల్పం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:–
హైదరాబాద్: మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత్ తెలంగాణ ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించనుంది. యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంపొందించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ జాతీయ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగారెడ్డి జిల్లాలోని సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్, సిద్ధిపేటలోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మరో ఐదు జిల్లాల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థల ప్రతినిధులతో సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ ఉద్యమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని 10 వేలకుపైగా కేంద్రాల్లో ఒక కోటి మందికి పైగా యువతతో ప్రత్యక్షంగా సంభాషించనున్నారు. ఈ సందర్భంగా యువతతో 'నషా ముక్త యువ ప్రతిజ్ఞ' చేయిస్తూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునివ్వనున్నారు. కార్యక్రమాల్లో అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చైతన్య కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా యంత్రాంగం, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి భారత్ తెలంగాణ విస్తృత స్థాయిలో సమన్వయం చేస్తోంది.మై భారత్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ చి. అన్వేష్ మాట్లాడుతూ, "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" కేవలం ఒక కార్యక్రమం కాదని, యువతను మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములను చేసే జాతీయ ఉద్యమమని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి యువకుడు, ప్రతి విద్యాసంస్థ, ప్రతి సామాజిక సంస్థ ఈ కార్యక్రమంలో పాల్గొని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం.. టీయూడబ్ల్యూజే హెచ్–143, తెంజు నూతన కమిటీలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 31:–
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్–143)తో పాటు తెంజు (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీలను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బృందావన్ కాలనీలో జరిగిన ఈ సమావేశం టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు సురమోని సత్యనారాయణ, తెంజు ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు వరికుప్పల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురమోని సత్యనారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే హెచ్–143 నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు, గృహ నిర్మాణ సౌకర్యాలు వంటి అంశాల సాధనకు సంఘం ఉద్యమిస్తుందని తెలిపారు. ఇంకా ఇళ్ల స్థలాలు పొందని జర్నలిస్టుల కోసం రాబోయే రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.
సమావేశంలో తెంజు నియోజకవర్గ అధ్యక్షుడిగా వరికుప్పల అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఆముదల సందీప్ కుమార్, కోశాధికారిగా జె. మహేందర్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా మెరుగుమళ్ల యాదగిరి, ఉపాధ్యక్షులుగా ముచ్చర్ల నాగేష్, రాఘవేందర్, ప్రచార కార్యదర్శిగా భూచక్రం గౌడ్, సలహాదారుగా రాపర్తి సంతోష్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా పోలమోని సురేష్ యాదవ్, చీమల రామకృష్ణ యాదవ్, కార్యనిర్వాహక సభ్యులుగా మహేష్ చారి, సొప్పరి యాదయ్య, యాంపల్ల శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే హెచ్–143 నియోజకవర్గ అధ్యక్షుడిగా సురమోని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మొలుగు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా మక్కపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, హనుమంతు సుదర్శన్, సలహాదారుగా పసునూరు వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా చెరుకూరి మల్లేష్, ప్రచార కార్యదర్శిగా నల్లోల్ల కిషన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీలకు అభినందనలు తెలిపారు.

# అంతర్రాష్ట్ర చోరీ ముఠాపై ఆదిబట్ల పోలీసుల ఉక్కుపాదం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:–
ఆదిబట్ల పోలీస్ డివిజన్ పోలీసులు రెండు కీలక చోరీ కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అంతర్రాష్ట్ర గృహచోరీలకు పాల్పడుతున్న ఒక నిందితుడితో పాటు వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అలవాటు నేరస్థులను అదుపులోకి తీసుకుని, రూ. 6.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్, మోటార్‌సైకిల్‌తో పాటు ఐదు చోరీ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన ముకేష్ చౌదరి ప్రస్తుతం హైదరాబాద్‌లో జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ, 2024 నుంచి పలు ప్రాంతాల్లో గృహచోరీలకు పాల్పడుతున్నాడు. ఆదిబట్ల క్రైమ్ టీమ్ మన్నెగూడ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆదిబట్లలో రెండు, హయత్‌నగర్‌లో నాలుగు, కుషాయిగూడలో ఒకటి కలిపి మొత్తం ఏడు గృహచోరీ కేసులను ఒప్పుకున్నాడు. గతంలోనూ అతనిపై 17 కేసులు నమోదై, పీడీ చట్టం కింద కూడా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.మరో కేసులో సయ్యద్ ఖాసిం హుస్సేన్, మహమ్మద్ అబ్దుల్ కరీమ్ ఖాన్ అనే ఇద్దరు యువకులను అరెస్టు చేసి, ఆదిబట్ల, చందానగర్, ఘట్‌కేసర్, చౌటుప్పల్, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోరీకి గురైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ఖాసిం హుస్సేన్‌పై ఇప్పటికే ఐదు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుల ఛేదనలో పాల్గొన్న ఆదిబట్ల పోలీసులు, క్రైమ్ టీమ్, సీసీఎస్ సిబ్బందిని శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్ అభినందించారు. ప్రజలు ఇళ్లలో సీసీ కెమెరాలు, ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలను భద్రమైన ప్రదేశాల్లో పార్క్ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ఈ సమావేశంలో సీఐ ఎస్ రమేష్, నోహెల్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# బాలాపూర్ టీయూడబ్ల్యూజే సంయుక్త కార్యదర్శిగా రాంబాబు



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 31:)
బాలాపూర్ మండలం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా కే.మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయంత్, సంయుక్త కార్యదర్శిగా బొల్లంపల్లి రాంబాబు ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బాలాపూర్ మండలం నూతన కమిటీ సంయుక్త కార్యదర్శిగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న మీడియా మిత్రులకు, అందుకు సహాయ సకారాలు అందించిన జర్నలిస్టులకు, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనలు, సలహాల మేరకు మండల కమిటీ సభ్యులతో కలిసి స్థానికంగా నెలకొన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తానన్నారు.

## టీఆర్‌పీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా మహేష్ గౌడ్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 31:–
తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా భీమాగోని మహేష్ గౌడ్‌ను నియమించారు. పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్‌కు, పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలు, అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రజల్లో మరింత బలోపేతం చేసి అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి యువతను పెద్ద ఎత్తున సమీకరించి, ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తానని మహేష్ గౌడ్ తెలిపారు. ఆయన నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.

# ఎస్ ఐ ఆర్ పై అవగాహనకు ఆటో ప్రచార రథాల ప్రారంభం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:–
ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆగస్టు 3తో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం, కొత్తగా అర్హులైన వారు నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి లేదా అందుబాటులో ఉన్న విధానాల ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రచార రథాల ద్వారా డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు, ప్రధాన కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటు హక్కు విలువను వివరించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటరు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఘన ప్రారంభం

### ప్రారంభించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి..తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచన




తెలంగాణ తొలి మెట్టు వరంగల్ హనుమకొండ జూలై 31
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
హనుమకొండలో జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఆసుపత్రిని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమానులు వి.మల్లేశం,వి.మల్లికార్జున్,ఎన్.సురేష్,ప్రదీప్,రూపేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్య, వైద్యం,వ్యవసాయం అత్యంత కీలకమైన రంగాలని పేర్కొన్నారు. ప్రజలు అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు వంటి అనేక కారణాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మానవత్వంతో వ్యవహరించి,తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని,పేదలు మరియు మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యం అందించాలని ఆయన కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యమని,ఆరోగ్యంగా ఉంటేనే విద్య, వ్యవసాయం సహా జీవితంలోని అన్ని రంగాల్లో ముందుకు సాగగలుగుతామని పేర్కొన్నారు. జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తీరని లోటు

- కోరపల్లి రాజేష్

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చిరస్థాయిగా నిలిపిన నాయకుడని నివాళి



హనుమకొండ, జూలై 31 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తీవ్ర విషాదకరమని కాకతీయ విశ్వవిద్యాలయం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు కోరపల్లి రాజేష్ పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఉద్యమ స్ఫూర్తితో పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ విస్తరణకు, కార్యకర్తలకు ఆయన అందించిన మార్గదర్శకత్వం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ పార్టీ విలువైన నాయకుడిని కోల్పోయిందని, ఆయన లేని లోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు కోరపల్లి రాజేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
1 శనివారం ఆగస్టు 2026

# రిజర్వేషన్ బచావో... సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం!

## జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



హైదరాబాద్, జూలై 31: దేశవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న "రిజర్వేషన్ హటావో" ప్రచారం కేవలం ఒక డిజిటల్ ట్రెండ్ మాత్రమే కాదని, భారత రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయంపై జరుగుతున్న దాడి, కుట్రగా చూడాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి పేర్కొన్నారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన "రిజర్వేషన్ బచావో" సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్లు ఎవరికో ఇచ్చే ప్రత్యేక హక్కులు కావని, శతాబ్దాలుగా సామాజిక, విద్యా, ఆర్థిక వివక్షకు గురైన వెనుకబడిన వర్గాలకు భారత రాజ్యాంగం కల్పించిన న్యాయబద్ధమైన రక్షణ వ్యవస్థ అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ భావోద్వేగాల ఆధారంగా కాకుండా రాజ్యాంగం, చరిత్ర, సామాజిక వాస్తవాలు, శాస్త్రీయ గణాంకాల ఆధారంగా సాగాలని కుమారస్వామి అన్నారు. "మెరిట్" గురించి మాట్లాడే ముందు సమాన అవకాశాలు ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలని సూచించారు. విద్య, ఉద్యోగాలు, పాలన, విధాన నిర్ణయ వ్యవస్థల్లో సముచిత ప్రాతినిధ్యం లేకుండా సమానత్వం సాధ్యం కాదని, అందుకే రిజర్వేషన్లు భారత ప్రజాస్వామ్యానికి అంతర్భాగమని పేర్కొన్నారు. సోషల్ మీడియా ట్రెండ్‌లు రాజ్యాంగాన్ని భర్తీ చేయలేవని, భారతదేశాన్ని నడిపేది రాజ్యాంగమేనని అన్నారు. రిజర్వేషన్లపై జరుగుతున్న దుష్ప్రచారం ఒక పథకం ప్రకారం సాగుతున్న రాజకీయ కుట్రలో భాగమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిని దేశ ప్రజలు అప్రమత్తంగా గమనించాలని పిలుపునిచ్చారు. దేశంలోని బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు సామాజిక న్యాయాన్ని విశ్వసించే ప్రజాస్వామ్య శక్తులన్నీ రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని కుమారస్వామి అన్నారు.

"రిజర్వేషన్ బచావో" ఉద్యమాన్ని దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతూ రాష్ట్రాల వారీగా జాతీయ సెమినార్లు, మేధో సదస్సులు, విద్యార్థి సమావేశాలు, న్యాయవేత్తల చర్చలు, యువజన చైతన్య కార్యక్రమాలు నిర్వహించి సామాజిక న్యాయ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సమన్వయ ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రకటించారు.

భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా ఎదుర్కొంటామని దుండ్ర కుమారస్వామి స్పష్టం చేశారు. రిజర్వేషన్లను కాపాడటం అంటే కేవలం ఒక విధానాన్ని రక్షించడం కాదని, భారత రాజ్యాంగ స్ఫూర్తిని, సమాన అవకాశాలను, సామాజిక న్యాయాన్ని, కోట్లాది వెనుకబడిన వర్గాల భవిష్యత్తును రక్షించడమేనని పేర్కొన్నారు. "రిజర్వేషన్ బచావో... సామాజిక న్యాయాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో దేశవ్యాప్తంగా జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించి, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఏకతాటిపైకి రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దాసు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సామ శేఖర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, ప్రముఖ సామాజికవేత్త అశోకు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## ప్రతి 45 రోజులకు పథకాలపై సమీక్ష: అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 31:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం మండలాల్లో వరుసగా నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో ఆయన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులతో సమావేశమై అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భూ సమస్యలు, ఆక్రమణలు, అక్రమ అనుమతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి పథకాల అమలుపై సమీక్ష నిర్వహించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాను ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, పేదల సమస్యలు తనకు బాగా తెలుసని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. అధికారులు స్థానికంగానే సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. యాచారం మండలంలో భూసేకరణ వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం జరుగుతుందని, పరిహారం పెంపు అంశాన్ని ముఖ్యమంత్రితో ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు. రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉండదని, అవసరమైన నిధులను తీసుకురావడం తన బాధ్యత అని చెప్పారు. ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ, ఆస్పత్రి నిర్మాణం, రహదారుల అభివృద్ధికి రూ.338 కోట్ల నిధులు మంజూరు చేయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.

# తల్లిపాలకు ప్రాధాన్యం.. ఆరోగ్యవంతమైన భావితరాలకు బాట



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:-
ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనుంది. ఈ ఏడాది "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం.. సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే అంశంతో జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. తల్లిపాలు శిశువుకు అత్యంత విలువైన తొలి ఆహారమని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు అందించడం ద్వారా శిశు మరణాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం రెండు సంవత్సరాల వయస్సు వరకు అదనపు ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.

తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలు అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి, న్యుమోనియా, అతిసారం వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. అలాగే తల్లికి ప్రసవానంతర ఆరోగ్య పునరుద్ధరణ, రక్తస్రావం తగ్గడం, మానసిక ప్రశాంతత, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. వారోత్సవాల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు, అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నీలోఫర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మానవ పాల బ్యాంకు అకాల శిశువులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. తల్లిపాల ప్రోత్సాహంలో కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు కావాలని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు అందించేందుకు అందరూ సహకరించాలని జిల్లా సంక్షేమ అధికారి పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు హెచ్‌ఎం చేయూత

## స్వంత నిధులతో రూ.20 వేల విలువైన నోట్‌బుక్స్ పంపిణీ..

## 125 మంది విద్యార్థులకు ప్రయోజనం



గీసుగొండ, జులై 31 హైదరాబాద్ ఎస్టేట్:
విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు చేయూతనందిస్తూ, గీసుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సుభాష్ మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. వచ్చే నెలలో పదవి విరమణ పొందనున్న ఆయన స్వంత నిధులతో సుమారు రూ.20 వేల విలువైన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ) నోట్‌బుక్స్ కొనుగోలు చేసి 125 మంది విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరో, ఏడో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు నోట్‌బుక్స్, ఎనిమిదో, తొమ్మిదో, పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడు నోట్‌బుక్స్ చొప్పున అందజేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తిస్తూ గతంలోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన కె. సుభాష్, పదవీ విరమణకు ముందూ విద్యార్థుల చదువుకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం విశేషమైంది. ఈ సందర్భంగా కె. సుభాష్ మాట్లాడుతూ, విద్యే వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని అన్నారు. పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అందజేసిన నోట్‌బుక్స్‌ను ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఎ. నమ్రత మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ దౌడు మమత మాట్లాడుతూ, అందించిన నోట్‌పుస్తకాలను సమర్థంగా వినియోగించి ప్రతి పరీక్షలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. గ్రామ ఉపసర్పంచ్ కోట ప్రమోద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, దాతలు అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. పద్మ, పి. అరుణశ్రీ, జి. జ్యోత్స్న ప్రభ, జి. వెంకట్రావు, ఎం. సబిత, టి. వెంకటేశ్వర్లు, ఎంఆర్‌సీ సిబ్బంది సారిక, రాజగోపాల్, శంకర్, నాన్-టీచింగ్ సిబ్బంది ఎం. రాజ్‌కుమార్, ఎ. నర్సయ్య పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 31:-
రంగారెడ్డి: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీ అడ్డా వద్ద కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పొట్టే రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, కార్మికరైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలతో సాధించిన దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకుని పాత చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 200 రోజుల ఉపాధి హామీతో రోజుకు రూ.600 వేతనం అమలు చేయాలని, మున్సిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో ఐత రాజు అంజయ్య, అంజయ్య గౌడ్, చుక్క రాములు, భూషరాజు కాశయ్య, మల్లేష్, నరసింహ, సైదులు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

## సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని బొట్ల చక్రపాణి పిలుపు



పరకాల, జులై 31 హైదరాబాద్ ఎస్టేట్:
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ఆగస్టు 1, 2 తేదీల్లో పరకాల పట్టణంలోని ఎఫ్‌జే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమరధామంలో పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా ఉద్యమాల దిశ, పార్టీ కార్యాచరణపై రాజకీయ శిక్షణ తరగతుల్లో కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పరకాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే రాజకీయ శిక్షణ తరగతులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషకు పోలీసు చేయూత

## భీమారం ప్రభుత్వ పాఠశాలలో పెద్దబాలశిక్ష పుస్తకాల పంపిణీ..

## తెలుగు భాషాభిమానాన్ని పెంపొందించాలని జయరాజు పిలుపు



హనుమకొండ, జులై 31 హైదరాబాద్ ఎస్టేట్:
ఆధునిక యుగంలో విద్యార్థులు మాతృభాషను మరవకుండా తెలుగు భాషపై పట్టు సాధించాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు అన్నారు. మాతృభాష పరిరక్షణకు తనవంతు కృషిగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దబాలశిక్ష పుస్తకాలను అందజేస్తున్న ఆయన, శుక్రవారం భీమారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెద్దబాలశిక్ష గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ, తాను విద్యార్థిగా ఉన్న సమయంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి పెద్దబాలశిక్ష ప్రాముఖ్యతను వివరించి, ఈ గ్రంథం విజ్ఞానానికి మార్గదర్శకమని చెప్పిన మాటలు తనకు స్ఫూర్తిగా నిలిచాయని తెలిపారు. అదే స్ఫూర్తితో కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు 20కు పైగా పెద్దబాలశిక్ష గ్రంథాలను విద్యార్థులకు అందజేసినట్లు చెప్పారు. పెద్దబాలశిక్ష తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, నైతిక విలువలు, సాధారణ విజ్ఞానాన్ని పరిచయం చేసే ప్రామాణిక గ్రంథమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పఠనాన్ని అలవర్చుకుని మాతృభాషపై పట్టు పెంపొందించుకోవాలని, నేర్చుకున్న విజ్ఞానాన్ని జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. భీమారం ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ సమక్షంలో విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# భువనేశ్వరి వ్యాఖ్యల్లో నిజం లేదు

## : లక్ష్మీపార్వతి




ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరికి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తనను అవమానించారంటూ భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు నిజమైతే, అందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల కుప్పం పర్యటనలో భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, కేవలం రాజకీయ సానుభూతి పొందేందుకే అలా మాట్లాడుతున్నారని లక్ష్మీపార్వతి కొట్టిపారేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీ రికార్డులు మొత్తం వారి చేతిలోనే ఉన్నాయని గుర్తుచేశారు. భువనేశ్వరి ఆరోపణలు నిజమే అయితే, ప్రభుత్వం వెంటనే ఆ రికార్డులను బహిర్గతం చేయాలే తప్ప, ఇలా సానుభూతి రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు చట్టబద్ధమైన రెండవ భార్యగా ఉన్న తనను ఐటీడీపీ సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్, మార్ఫింగ్ చిత్రాలతో వేధించినప్పుడు భువనేశ్వరి ఎందుకు మౌనంగా ఉన్నారని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ కలిసి భువనేశ్వరిని రాజకీయాల్లోకి లాగారని ఆరోపించారు. వైసీపీ ఎప్పుడూ ఆమెపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. వైఎస్ కుటుంబంలోని మహిళలపై ఆన్‌లైన్‌లో దాడులు జరిగినప్పుడు గానీ, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నప్పుడు గానీ భువనేశ్వరి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటానని చంద్రబాబు చెప్పడం "ఈ సంవత్సరంలోనే అతిపెద్ద జోక్" అని లక్ష్మీపార్వతి ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కీలక హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దివంగత రాజశేఖర రెడ్డి, జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, చంద్రబాబు, లోకేశ్ అలా కాదని అన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో లోకేశ్ ప్రదర్శించిన 'రెడ్ బుక్' పాలన గురించి కూడా ఆమె ప్రస్తావించారు. వైసీపీ హయాంలో టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న అధికారుల పేర్లు అందులో ఉన్నాయని చెప్పి, ఇప్పుడు కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భువనేశ్వరి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తానని, అయితే రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు చంద్రబాబు, లోకేశ్‌ల 'రెడ్ బుక్' పాలన, దుష్పరిపాలనలకు గాను రాష్ట్ర ప్రజలకు ఆమె క్షమాపణ చెప్పాలని లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు.

# సీదిరి అప్పలరాజుకు ఎదురుదెబ్బ..

## బెయిల్ పిటిషన్ కొట్టివేసిన కోర్టు



మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు కోర్టులో చుక్కెదురైంది. తన కుమారుడు చేసిన రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను తారుమారు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆయనకు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. సీదిరి అప్పలరాజు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు శుక్రవారం కొట్టివేసింది. దీంతో ఆయన జైల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. జులై 10వ తేదీన శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పాత జాతీయ రహదారిపై అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడుపుతున్న బైక్, దానయ్య (45) అనే గొర్రెల కాపరిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో దానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజు తన కుమారుడిని అక్కడి నుంచి కారులో తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని కొడుకును రక్షించేందుకు, తన అనుచరుడైన సిద్ధార్థ్ అనే యువకుడితో తానే ప్రమాదం చేశానని పోలీసుల ముందు లొంగిపోయేలా నాటకం ఆడించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి ముందు సమీపంలోని పెట్రోల్ బంకులో ఆరవ్ వర్మ తన బైక్‌లో పెట్రోల్ నింపుతున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ కావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. పోలీసులను తప్పుదోవ పట్టించడం, సాక్ష్యాలను నాశనం చేయడం, బాధితుడి కుటుంబంపై ఒత్తిడి తేవడం వంటి అభియోగాలతో ఈ కేసులో అప్పలరాజును మూడో నిందితుడిగా (ఏ3) చేర్చారు. జులై 22న ఆయన్ను అరెస్ట్ చేయగా, ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా బెయిల్ పిటిషన్ కూడా తిరస్కరణకు గురికావడంతో ఆయన జైల్లోనే కొనసాగనున్నారు.

# భోగాపురంలో రేపు ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ...

## ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా'ను కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

## - ప్రజలకు అందుబాటు వైద్య సేవలు అందించాలి - ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

హనుమకొండ, జూలై 31 హైదరాబాద్ ఎస్టేట్: హనుమకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో విద్య, వైద్యం, వ్యవసాయం కీలక రంగాలని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులను ఆశ్రయించే ప్రజలకు అందుబాటు ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్య సంస్థల సామాజిక బాధ్యత అని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్యమే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి మూలాధారమని పేర్కొన్న




ఆయన, ప్రజలకు విశ్వసనీయమైన వైద్య సేవలు అందించే దిశగా జీవ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధులు వి. మల్లేశం, వి. మల్లికార్జున్, ఎన్. సురేష్, ప్రదీప్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బిజెపి గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలి

## - రాష్ట్ర నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 31
:- భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు గోదల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోడీ గారి 12 సంవత్సరాల సుపరీ పాలనలో దేశంలో అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి చెందింది. కానీ మన రాష్ట్రంలో గతంలో తెలంగాణను కెసిఆర్ దోచుకుంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా మారిందని. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలి అంటే బిజెపి ప్రభుత్వం రావాలి అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు పోరెడ్డి నర్సింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్, మహిళా మోర్చా ఉపాధ్యక్షులు శ్వేతా, నేరపల్లి సర్పంచ్ జి. శ్రీహరి, మాజీ ఎంపీటీసీ విష్ణు వర్ధన్ రెడ్డి, మొగిలి గణేష్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బాలశివడు, మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బాధ్యతలు చేపట్టిన మల్లేష్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 31:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మల్లేష్ యాదవ్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.. మల్లేష్ యాదవ్ కి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన మహేశ్వరం మండల్ మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి మరియు గట్టుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సందర్భంగా.. మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో పార్టీ బలోపేతం చేయాలని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వచ్చే ఎన్నికలలో మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా ఉండాలని తెలియజేస్తూ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని మండల నాయకులను ప్రతి ఒక్కరిని కలుపుకొని పోవాలని రఘు మా రెడ్డి ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మల్లేష్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి పత్రికా ప్రకటనలో తెలియజేశారు



# ఉద్యమనేతకు జన సంద్రం మధ్య తుది వీడ్కోలు

## - నల్లబెల్లికి పోటెత్తిన ప్రజలు..

## - నివాళులర్పించిన రాజకీయ, ప్రజా ప్రముఖులు

నల్లబెల్లి, జూలై 31 హైదరాబాద్ ఎస్టేట్: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఉద్యమనేత పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణ వ్యాప్తంగా విషాదాన్ని నింపింది. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఆయన కన్నుమూసిన విషయం అధికారికంగా వెలువడిన అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి ఉద్యమకారులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా నల్లబెల్లికి తరలివచ్చి అశ్రునయనాల మధ్య మహానేతకు తుది వీడ్కోలు పలికారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామం నల్లబెల్లి వరకు సాగిన అంతిమయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమనేతకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమంలో పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకుంటూ పలువురు నేతలు భావోద్వేగానికి గురయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజలతో మమేకమైన నాయకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ మంత్రి



ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమ సహచరులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాక రాష్ట్రానికే తీరని లోటని పలువురు నాయకులు, ఉద్యమ



సహచరులు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవ, ఉద్యమస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in



# వరంగల్ న్యాయ మౌలిక వసతులపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

న్యూఢిల్లీ - పార్లమెంట్
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేది :31-07-2026

వరంగల్ జిల్లాలో న్యాయ మౌలిక వసతుల అభివృద్ధి, ఈ-కోర్టుల విస్తరణ, కోర్టు భవనాల నిర్మాణం, డిజిటల్ న్యాయ సేవల పురోగతిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం, పూర్తయిన ప్రాజెక్టులు, అమలులో ఉన్న పనులు, ఈ-కోర్టుల అభివృద్ధి చర్యలపై స్పష్టమైన వివరాలను కోరారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లా, సబ్‌ఆర్డినేట్ కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి పై రాష్ట్రాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్రం 1993-94 నుంచి ప్రత్యేక కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణకు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.11.16 కోట్ల నిధులు విడుదల చేసి వినియోగించినట్లు కేంద్రం వెల్లడించింది. 2024-25లో రూ.1.96 కోట్లు, 2025-26లో రూ.9.20 కోట్లు విడుదల కాగా, 2026-27 సంవత్సరానికి రూ.15.79 కోట్ల మదర్ శాంక్షన్ మంజూరు చేసినట్లు తెలిపింది.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయ సేవలు అందుబాటులోకి రావాలంటే ఆధునిక సాంకేతికతతో పాటు మెరుగైన మౌలిక వసతులు అవసరమని అన్నారు. ఈ-కోర్టుల ఫేజ్-3 కింద జిల్లాకు నిధులు మంజూరు చేసి డిజిటల్ సేవలను విస్తరించడం, ఈ-సేవా కేంద్రాల ఏర్పాటు, వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయాలు కల్పించడం వల్ల న్యాయ సేవలు మరింత ప్రజలకు



చేరువవుతాయని చెప్పారు. జిల్లాలో కోర్టుల ఆధునికీకరణ, సాంకేతిక సదుపాయాల విస్తరణతో పాటు భవిష్యత్తులో అవసరమైన చోట కొత్త న్యాయ మౌలిక వసతుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# ఇబ్రహీంపట్నం నియోజకవర్గ టీయూడబ్ల్యూజే హెచ్ -143, తెంజు నూతన కమిటీల ఎన్నిక

## జర్నలిస్టులంతా ఏకతాటిపై కొచ్చి ఐక్యమత్తంగా పోరాడాలి

హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి , జులై 31

:- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం టియుడబ్ల్యూజే హెచ్- 143, తెంజు నూతన కమిటీల ఎన్నిక తెలంగాణ టీయూడబ్ల్యూజే హెచ్ 143 రథసారథి అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్, జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గదం రమేష్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం తెంచు నియోజవర్గ అధ్యక్షులు వరికుప్పల అశోక్ ఆధ్వర్యంలో టి యు డబ్ల్యూ జే హెచ్ -143), తెంజు (ప్రింట్,అండ్ ఎలక్ట్రానిక్స్ మీడియా నియోజకవర్గ నూతన కమిటీల ఎన్నిక బృందావన కాలనీలో శుక్రవారం జరిగింది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు సురమొని సత్యనారాయణ మాట్లాడుతూ..రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హక్కుల సాధనకై టి యు డబ్ల్యూ జే వన్ ఫోర్ త్రీ పోరాడిందని, నియోజకవర్గ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎల్లవేళలా పాటుపడుతుందని అన్నారు. ఇళ్ల స్థలాలు రాని జర్నలిస్టుల కోసం రాబోయే రోజుల్లో టి యు డబ్ల్యూ జే హెచ్- 143 ఆధ్వర్యంలో పోరాటం చేస్తుందని తెలిపారు. మునుముందు జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు,అక్రిడిటేషన్ కార్డుల సాధన, ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు, గృహ నిర్మాణం, తదితర హక్కుల పరిరక్షణ కోసం ఈ కమిటీలు ఉద్యమిస్తాయని అన్నారు.నూతన కమిటీల



ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా నాయకులు హరికృష్ణ రెడ్డి, చెరుకూరి మహేందర్,చెరుకూరి రాజు తోపాటు నూతనంగా జిల్లా కమిటీ సభ్యులుగా టిఎం చండీశ్వర్, చీమల రామకృష్ణ యాదవ్, పోలమోని సురేష్ యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు.టి యు డబ్ల్యూ జే తెంజు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక తెంజు నియోజకవర్గ అధ్యక్షులుగా :వరికుప్పల అశోక్,
ప్రధాన కార్యదర్శి ఆముదల సందీప్ కుమార్,కోశాధికారి :జె.మహేందర్, సంయుక్త కార్యదర్శి యాదగిరి గౌడ్,ఉపాధ్యక్షులుగా ముచ్చర్ల నాగేష్, రాఘవేందర్,ప్రచార కార్యదర్శి భూచక్రంగౌడ్,

సలహాదారుడు రాపర్తి సంతోష్, జిల్లా కమిటీ సభ్యులుగా పోలమోని సురేష్ యాదవ్,చీమల ఆర్కే కృష్ణ, యాదవ్, కార్యనిర్వాహక సభ్యులు మహేష్ చారి, సొప్పరి యాదయ్య. యాంపల్ల శ్రీకాంత్ రెడ్డి



తదితరులు టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన కమిటీ టీయూడబ్ల్యూజే హెచ్- 143: నియోజకవర్గ అధ్యక్షులుగా సురమోనిసత్యనారాయణ, ప్రధానకార్యదర్శిమెలుగు శ్రీనివాస్ ,గౌరవ అధ్యక్షులుగా మక్కపల్లి శ్రీనివాస్,కోశాధికారి నరేందర్ రెడ్డి,ఉపాధ్యక్షులు ఆంజనేయులు, హనుమంతు సుదర్శన్,సలహాదారు పసునూరు వెంకటేష్,సంయుక్త కార్యదర్శి చెరుకూరి మల్లేష్,ప్రచార కార్యదర్శి నల్లోల్లకిషన్,జిల్లా నాయకులుగా చండీశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సురమోని బాబు, విజయ్,గోవర్ధన్, రాజు ,ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఆలంపల్లి సురేష్, పంది బుగ్గ రాములు, రామచందర్, బస్వాపురం దశరథ, చెనమోని గోపాల్, సాల్వా చారి, మచ్చ మహేందర్, మేకల సురేష్,ఆలంపల్లి దుర్గేష్ ప్రింట్,ఎలక్ట్రానిక్ పాత్రికేయులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ సంతకాల ఉద్యమం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 31:-
హయత్‌నగర్: రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన "ఫీజుల బకాయి బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేవైఎం నాయకులు పారంద సాయి, జయ తేజ ఆధ్వర్యంలో హయత్‌నగర్ పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్‌లో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోలాం యశ్పాల్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యశ్పాల్ గౌడ్ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఇప్పటికీ విడుదల కాకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాయని విమర్శించారు.

పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు నక్క రాజేష్ గౌడ్,



ప్రమోద్ రెడ్డి, బీజేవైఎం హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ నాయకులు ఎర్ర ప్రేమ, పాండాల అభిలాష్ గౌడ్, విష్ణు చారి, బుల్లెట్ సాయి యాదవ్, చరణ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగర్ రింగ్ రోడ్ లో బ్యాట్స్ అండ్ బైట్స్.. ప్రారంభోత్సవం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఎల్బీనగర్ జూలై 31 :

అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన అల్పాహారం టి అండ్ కాఫీ ఆరోగ్యానికి తాకతునిచ్చే పానీయాలు, ప్రత్యేకంగా క్రికెట్ ఆటగాళ్లకు అభిమానులకు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన, ఆహ్లాదకరమైన,నాణ్యమైన అల్పాహారం అందించడమే లక్ష్యంగా ఎల్బీనగర్ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు సబ్ రిజిస్టర్ ప్రక్కన బ్యాట్స్ అండ్ బైట్స్ ప్రాంగణంలో ప్రిన్స్ క్యాఫెటీరియా ఒక అల్పాహార కేంద్రాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభోత్సవం చేసుకున్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు షేక్ ఇజర్ మాట్లాడుతూ, రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు, చల్లటి పానీయాలతో పాటు డ్రైవ్-ఇన్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ప్రిన్స్ క్యాఫెటీరియాన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నలుపుబంగారు (బ్లాక్ అండ్ గోల్డ్) థీమ్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ క్యాఫెటీరియాలో అన్ని వర్గాల ప్రజలు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమాయత్తంగా కలిసి గడుపుతూ మాదిత్యాన్ని ఆస్వాదించాలని కోరారు మావద్ద .రక రకాల అల్పాహార భోజన పదార్థాలు, చల్లటి నాణ్యమైన ప్రమాణాలతో కలిగిన పానీయాలు అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యంగా క్రికెట్ ఆడుతూ లేదా వీక్షిస్తూ డ్రైవ్-ఇన్ అనుభూతిని పొందేలా ప్రత్యేకంగా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఉత్తమ సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో షేక్ ఇక్బాల్ సాహెబ్, షేక్



సల్మాన్, షేక్ సోయల్, షేక్ సాయల్, షేక్ సాహెబ్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాభినందనలు తెలియజేశారు.ప్రిన్స్ క్యాఫెటీరియాకయాకు మంచి ప్రజాదరణ లభిస్తుందని ఆశిస్తూ..

# స్టేటస్‌లు పెరుగుతున్నాయి...

## కానీ సంబంధాలు ఎందుకు తగ్గిపోతున్నాయి?



ఒక ప్రశ్న...
మీ ఫోన్‌లో వెయ్యి కాంటాక్ట్స్ ఉండొచ్చు...
వందల మంది ఫ్రెండ్స్ ఉండొచ్చు...
వేల మంది ఫాలోవర్స్ ఉండొచ్చు...
కానీ...
అర్ధరాత్రి ఆపద వస్తే" నేనున్నాను అనే భరోసా ఇచ్చి చెప్పగలిగే మనిషి ఎంతమంది ఉన్నారు?
అదే జీవితానికి అసలు సమాధానం.
ఈరోజు మనం చాలా సంపాదిస్తున్నాం.
మంచి ఉద్యోగాలు... మంచి జీతాలు... మంచి ఇళ్లు... మంచి కార్లు...
కానీ...
మనల్ని నిజంగా ప్రేమించే మనుషులను మాత్రం కోల్పోతున్నాం.
ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక విచిత్రమైన నిశ్శబ్దం కనిపిస్తోంది.
అందరి చేతిలో ఫోన్ ఉంది...
కానీ ఒకరితో ఒకరు మాట్లాడే సమయం లేదు.
అందరూ ఆన్లైన్‌లో ఉన్నారు...
కానీ మనసులు మాత్రం ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి.
ప్రతి రోజు "+శీశీ వీశీతీఅఱఅస్త్ర" మెసేజ్‌లు వంద వస్తాయి...
కానీ "ఎలా ఉన్నావు?" అని నిజంగా అడిగే మనిషి చాలా అరుదు.
ఇప్పుడు మనం బంధాలను కూడా లాభనష్టాల కోణంలో చూస్తున్నాం.
"వాళ్లు మన ఇంటికి రాలేదు... మనం ఎందుకు వెళ్లాలి?"
"వాళ్లు ఫోన్ చేయలేదు... మనం ఎందుకు చేయాలి?"
ఇలా లెక్కలు వేసుకుంటూ...
మనుషులను ఒక్కొక్కరిని జీవితంలో నుంచి తీసేస్తున్నాం.
ఒక్కసారి ఆలోచించండి...
మన తాతలు, అమ్మమ్మలు వదిలింది కోట్ల ఆస్తులు కాదు...
కలిసిమెలిసి ఉండే సంస్కృతి.
మన తల్లిదండ్రులు నేర్పింది పెద్ద ఇళ్లు కట్టుకోవడం కాదు...
మనుషులను కలుపుకొని వెళ్లడం.
మరి మనం మన పిల్లలకు ఏమి నేర్పిస్తున్నాం?
"ఫస్ట్ రావాలి..."
"ఎక్కువ సంపాదించాలి..."
"అందరికంటే పైకి వెళ్లాలి..."
అని చెబుతున్నాం.
కానీ...
"ఎవరినీ చిన్నచూపు చూడొద్దు..."
"బంధాలను వదులుకోవద్దు..."
"కష్టంలో ఉన్నవారికి తోడుగా నిలబడు..."
అని ఎంతమంది చెబుతున్నాం?
జీవితంలో ఒక నిజం ఉంది.
మీ బ్యాంక్ బ్యాలెన్స్ మీ అంత్యక్రియలకు రాదు.
మీ హోదా మీకు కన్నీరు పెట్టదు.
మీ కారు మీకు ఓదార్పు చెప్పదు.
మనుషులే వస్తారు.
బంధాలే నిలుస్తాయి.
ప్రేమే గుర్తుండిపోతుంది.
ఈరోజు మనం అహం కోసం మాట్లాడకపోతే...
రేపు మాట్లాడాలనుకున్నా వినే మనిషే ఉండకపోవచ్చు.
ఈరోజు మనం బిజీ అని దూరం పెడితే...
రేపు మన ఒంటరితనాన్ని పంచుకునే భుజం దొరకకపోవచ్చు.
ఒక్కసారి మీ ఫోన్ తీసుకోండి.
నెలలుగా మాట్లాడని ఒక బంధువుకు కాల్ చేయండి.
"ఎలా ఉన్నావు?" అని మాత్రమే అడగండి.
మీరు మొదలుపెట్టిన ఆ ఒక్క మాట...
ఒక విరిగిన బంధాన్ని మళ్లీ కలపవచ్చు.
మనం సోషల్ మీడియాలో వేల పోస్టులు పెడతాం.
ఒక్కసారి...
మన అమ్మానాన్నలతో గంటసేపు మాట్లాడామా?
మన అన్నాచెల్లెళ్లతో మనస్ఫూర్తిగా నవ్వుకున్నామా?
మన బంధువుల ఇంటికి పనిలేకుండా వెళ్లామా?
జీవితం చాలా చిన్నది.
అహం పెట్టుకోవడానికి కాదు...
మనుషులను హత్తుకోవడానికి.
డబ్బు సంపాదించండి...
కానీ మనుషులను కోల్పోయి కాదు.
విజయం సాధించండి...
కానీ బంధాలను త్యాగం చేసి కాదు.
పిల్లలకు ఆస్తులు ఇవ్వండి...
కానీ వాటికంటే విలువైన సంబంధాలను కూడా వారసత్వంగా ఇవ్వండి.
గుర్తుంచుకోండి...
మీ పిల్లలు మీరు సంపాదించిన డబ్బును కొంతకాలం మాత్రమే గుర్తుంచుకుంటారు.
కానీ మీరు ఎలా మనుషులను ప్రేమించారో...
ఎలా బంధాలను కాపాడారో...
అదే తరతరాలకు గుర్తుండిపోతుంది.
ఈరోజు నుంచే ఒక నిర్ణయం తీసుకుందాం.
అహం తగ్గిద్దాం.క్షమించడం నేర్చుకుందాం.
ముందుగా మనమే పలకరిద్దాం.
కుటుంబాన్ని మళ్లీ కుటుంబంగా మార్చుకుందాం.
ఎందుకంటే...
మనిషి చనిపోయిన తర్వాత అతని బ్యాంక్ బ్యాలెన్స్ గురించి ఎవరూ మాట్లాడరు...
అతను ఎంత మంచి మనిషో... ఎంతమందిని కలుపుకొని జీవించాడో... అదే మాట్లాడుకుంటారు.
మనం వదిలి వెళ్లాల్సింది ఆస్తులు
మాత్రమే కాదు...
మన పిల్లలు గర్వంగా చెప్పుకునే బంధాల ప్రపంచం కూడా.
మార్పు ప్రపంచంలో రావాలని ఎదురుచూడకండి...
మీ ఇంటి నుంచే... మీ పలకరింపుతోనే ప్రారంభించండి!

సేకరణ:
దుర్గం వివేక్ ప్రేమ్ రత్నం
సబ్ ఎడిటర్,
హైదరాబాద్ ఎస్టేట్ దినపత్రిక.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in


# వచ్చేసింది కార్తీ 'సర్దార్ 2' టీజర్.. యాక్షన్ డోస్ నెక్స్ట్ లెవెల్!


కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు.




దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# షూటింగ్‌లో రష్మికకు గాయం..

## ఆరు వారాల విశ్రాంతి




ప్రముఖ నటి రష్మిక మందన్న ఒక చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారు. ఒక పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు నిర్ధారించి, ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రష్మిక మందన్న 'రణబాలి' అనే చిత్రంలో తన భర్త, హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. దీనితో పాటు, 'మైసా' అనే మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో రష్మిక గాయపడటం ఆమె నటిస్తున్న చిత్రాల షూటింగ్‌లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆరు వారాల పాటు రష్మిక విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో, ఆమె అంగీకరించిన సినిమాల చిత్రీకరణ షెడ్యూల్స్ వాయిదా పడనున్నాయి. ఈ గాయం నుండి ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.


# నాని 'ప్యారడైజ్' టీజర్ వచ్చేస్తోంది..

## 'జడల్ జమానా'కు సిద్ధంగా ఉండండి!

నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను ఆగస్ట్ 6వ తేదీన విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. 'జడల్ జమానా' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఈ అప్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ 1 నిమిషం 35 సెకన్ల నిడివితో ఉంటుందని, ఇది పూర్తి 'మ్యాడ్‌నెస్'తో ప్రేక్షకులను అలరించనుందని తెలిపారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో నాని 'జడల్' అనే సరికొత్త మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు చిత్ర నిర్మాణ సంస్థ అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా టీజర్ విడుదల తేదీని ప్రకటించడంతో నాని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.



# వరుణ్ భక్తి ఎంతలా ఉందంటే?



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ అంటే చాలా మందికి ముందుగా గుర్తుకు వచ్చేది ఆయన సినిమాలు, మెగా ఫ్యామిలీ, యాక్షన్ రోల్స్. కానీ స్క్రీన్ వెనుక ఆయన జీవితంలో మరో యాంగిల్ ఉంది. అది ఆధ్యాత్మికత. ముఖ్యంగా హనుమంతుడిపై ఆయనకున్న భక్తి గురించి తాజాగా చేసిన కామెంట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. "నా బ్యాగ్ లో ఎప్పుడూ హనుమాన్ చాలీసా బుక్ ఉంటుంది. వారానికి రెండు సార్లు తప్పకుండా చదువుతాను" అంటూ వరుణ్ వెల్లడించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వరుణ్ తేజ్ ప్రస్తుతం కొరియన్ కనకరాజు ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా హనుమంతుడిపై తనకున్న భక్తి గురించి చెప్పిన విషయాలు ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటున్నాయి. "నేను వారానికి రెండు సార్లు హనుమాన్ చాలీసా చదువుతా. నా బ్యాగ్ లో ఎప్పుడూ హనుమాన్ చాలీసా బుక్ ఉంటుంది. కొన్నిసార్లు నేను మర్చిపోయినా, మా వైఫ్ గుర్తు చేస్తుంది. ఆమె ఎంతో భక్తితో పూజలు చేస్తుంది. హనుమంతుడిని ప్రత్యేకంగా ఆరాధిస్తుంది" అని వరుణ్ తేజ్ తెలిపారు. ఇప్పటి వరకు వరుణ్ తేజ్ ను ప్రేక్షకులు యాక్షన్ హీరోగా, విభిన్న కథలను ఎంచుకునే నటుడిగా చూశారు. కానీ ఆయనలోని డివోషనల్ యాంగిల్ గురించి పెద్దగా బయటకు రాలేదు. తాజాగా చేసిన కామెంట్స్ తో ఆయన పర్సనాలిటీలోని మరో యాంగిల్ అభిమానులకు తెలిసింది. సినీ ఇండస్ట్రీలో బిజీ షెడ్యూల్, షూటింగ్ లు, జర్నీల మధ్య కూడా ఆధ్యాత్మికతకు సమయం కేటాయించడం విశేషంగా మారింది. అంతేకాదు, తన కొడుకు పేరుకు సంబంధించిన విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు. "హనుమంతుడిపై మాకు ఉన్న భక్తి కారణంగానే మా కొడుక్కి వాయు అనే పేరు పెట్టాం" అని చెప్పారు. పురాణాల ప్రకారం వాయుదేవుడు హనుమంతుడి తండ్రి. అందుకే ఆ పేరును తమ కుటుంబానికి ప్రత్యేకంగా భావించామని ఆయన వివరించారు. ఇటీవల సినీ సెలబ్రిటీలు తమ వ్యక్తిగత విశ్వాసాలు, ఆధ్యాత్మిక అనుభవాల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారు. కొందరు ఆలయాలను సందర్శిస్తే, మరికొందరు తమకు ఇష్టమైన దేవతల గురించి చెబుతున్నారు. ఆ జాబితాలో ఇప్పుడు వరుణ్ తేజ్ కూడా చేరారు. ముఖ్యంగా హనుమాన్ చాలీసాను క్రమం తప్పకుండా చదువుతానని చెప్పడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరోవైపు కొరియన్ కనకరాజు సినిమాపై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా వరుణ్ తేజ్ చెప్పిన ప్రతి విషయం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే సినిమాకు సంబంధించిన అంశాల కంటే ఆయన చెప్పిన ఆధ్యాత్మిక విషయాలే ప్రస్తుతం ఎక్కువగా చర్చకు దారి తీస్తున్నాయి. సెలబ్రిటీల లైఫ్స్ ఎంతో బిజీగా ఉంటాయి. అయినప్పటికీ తమ నమ్మకాలు, సంప్రదాయాలను కొనసాగించడం చాలామందికి ఇన్స్పిరేషన్ గా ఉంటుంది. వరుణ్ తేజ్ చేసిన కామెంట్స్ ను కూడా అదే మెసేజ్ ఇస్తున్నాయి. కెరీర్ లో ఎంత ఎత్తుకు వెళ్లినా, మన విశ్వాసాలను మరిచిపోకూడదనే విషయాన్ని ఆయన మరోసారి గుర్తు చేసినట్టైంది

# పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నెల్!

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గ్లామర్‌తో నటనతో అలరించిన నటి పూజాహెగ్డే వ్యక్తిగత జీవితానికి సంబం ధించిన ఓ ఆసక్తికర వార్త వైరల్ అవుతోంది. తాజాగా అమ్మడు వివాహం గురించి ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పూజాహెగ్డే పెళ్లికి గ్రీన్ సిగ్నెల్ ఇచ్చిందని.. త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతుందంటూ బాలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా పూజాహెగ్డేకు సరైన అవకాశాలు రాని సంగతి తెలిసిందే. దీంతో అమ్మడు కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పూజ తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లికి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండస్ట్రీకి చెందినవారా ? వ్యాపార రంగం నుంచి ఎవరైనా వస్తారా? అనే దానిపై క్లారిటీ లేదు గానీ.. కుటుంబ సభ్యులు మాత్రం మంచి వరుడిని వెతికే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం జరుగుతోంది. పూజాహెగ్డే తల్లిదండ్రులు తగిన వరుడిని అన్వేషిస్తున్నారని.. త్వరలోనే ఈ విషయమై కుటుంబ సభ్యుల సమక్షంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. నటిగా ఎన్నో విజయాలను అందుకున్న పూజాహెగ్డే ఇప్పుడు జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకోవడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ూశ్రీంశీ =ఘుం – బాలయ్య కూతురి అరంగేట్రం నిజమేనా? ూంఒజవతీఅంవఎవత్ గతంలో పూజాహెగ్డే ప్రేమ వ్యవహారాలకు సంబంధించి పలుహ్యార్లు రూమర్స్ వినిపించినప్పటికీ వాటిని ధృవీకరించలేదు. కెరీర్ పట్ల పూర్తి ఏకాగ్రత పెట్టిన అమ్మడు ఇప్పుడు కుటుంబం కోరిక మేరకు వివాహానికి సిద్ధమవ్వడం విశేషం. వివాహం తర్వాత కూడా సినిమాలు కొనసాగిస్తారా లేదా అనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రస్తుతం పెళ్లి వార్త నెట్టింట మార్మోగిపోతోంది. గ్లామరస్ హీరోయిన్‌గా టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సరసన నటించిన పూజాహెగ్డే అందచందాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. అలాంటి అగ్ర నటి పెళ్లి పీటలెక్కిబోతుందనే వార్త తెలియగానే ఆమె అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పూజాహెగ్డే జీవితంలో నూతన అధ్యాయం సుఖసంతోషాలతో సాగాలని కోరుకుంటున్నారు. ఇక పూజాహెగ్డే సినిమాల విషయానికి వస్తే ఇటీవలే –జన నాయగన్– సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. సరైన అవకాశాలు రాక ఇబ్బంది పడుతోన్న సమయంలో –జన నాయగన్– విజయంతో బౌన్స్ బ్యాక్ అవ్వాలనుకుంది. కానీ ఆ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. బాక్సాఫీస్ వద్ద రొటీన్ చిత్రంగానే తేలిపోయింది. ప్రస్తుతం తెలుగులో ఓ రెండు సినిమాలకు సైన్ చేసింది. దీంతో వాటిపైన ఆశలన్నీ.







